# బాకీ సంతతి



రంగయ్య నుంచుని ఉన్నాడు.

గడ్డం కింద చేతికర్ర మోపుచేసి, కర్రకి కాలు మెలికేసి వీధిలో గుమ్మానికడ్డంగా నుంచుని ఉన్నాడు.

నిలబడ్డ రంగయ్య, తోకమీద నుంచున్న పాములా ఉన్నాడు.

“పంతులుగారో!” అని కేకేశాడు రంగయ్య.

అది ఉరుములాంటి కేక.

పగబట్టిన పాము బుసలాంటి కేక.

ఇంట్లోంచి సమాధానం రాలేదు.

కర్ర మీదకి వంగి నుంచున్న రంగయ్య కళ్ళు ఇంట్లోకి చీల్చుకుంటూ చూశాయి. మనిషి అలికిడి లేదు.

‘పంతులుగారో’ మళ్ళీ పిడుగులాంటి కేక.

అంబోతు రంకెలాంటి కేక.

లోపలున్న పంతులు ఉలిక్కిపడ్డాడు. కిటికీలోంచి చూశాడు. వాకిట్లో పది తలల నాగుపాము బుసలు కొడ్తున్నట్లు రంగయ్య. రంగయ్య కళ్ళు కణకణలాడుతున్నాయి. పంతులుకి గుండె దడదడ కొట్టుకుంది. పిల్లని పంపించి, "స్నానం చేస్తున్నారు. అరుగు మీద కూర్చో మనవే" అని చెప్పాడు.

పిల్ల చెప్పినా రంగయ్య కూర్చోలేదు. కర్రకి కాలు మెలికేసి అలాగే గుమ్మాని కడ్డంగా నుంచున్నాడు. పంతులు స్నానం ఇందాకనే అయిపోయింది. రంగయ్యని అలా చూస్తుంటే వొళ్ళంతా చెమటల్తో తడిసి పోతోంది. అతనికిఎదురుగా వెళ్ళటానికి కాళ్ళు వణుకుతున్నాయి అరగంటయ్యింది. రంగయ్య కదల్లేదు. అలాగే చూస్తున్నాడు. ఆ చూపుల్లో కసి! పగ, ఆ చూపులు కత్తులు పాడిచినట్లు పొడుస్తున్నాయి. పంతుల్ని కింద పడేసి గుండెలమీద కెక్కి గొంతు పిసుకుతూ అడుగుతున్నాయి.

ఏవయ్యా పంతులూ! నన్నూ నా కుటుంబాన్నీ నాశనం చేసింది చాలక నా చేతు లిరగ్గొడతావా? నేనేం తప్పు చేశానయ్యా! నేల నమ్ముకున్న వోణ్ణి! అప్పు కింద నా ఎద్దుల్ని జప్తుచేసి నా చేతులు నరుకుతావంటయ్యా!

అయినా పంతులూ, ఎప్పటి బాకీ అయ్యా అది. మా అయ్య చేసిన బాకీ కాదూ! అయ్యకిచ్చిన మాటకోసం ప్రతిఏడూ నీ బాకీకి జమేస్తున్నానే! పండిన పంటలో మూడొంతులు కళ్ళం నుంచే నీ ఇంటికి తోల్తున్నానే! మిగిలిన గింజలు తిండికి చాలకపోతే పిల్లా పాపా గంజి తాగి గడుపుకుంటూ వచ్చామే? నువ్వెన్నడూ అయ్యో అనలేదే? నీ జమ ఆపలేదే!

ఏ బాకీ శాపమై నా బతుకు బూడిద చేసింది గదా! నిన్నెప్పుడన్నా పల్లెత్తు మాటన్నానా? ఇంటిదానికి, నగల మాట దేవుడెరుగు కాస్తంత మంచి చీర కొనెరుగుదునా? నా ఇల్లాలి మెళ్ళో కంటె ఎప్పుడు నీ కంటబడిందో మరుసటేడే నీకు జమ అయిపోయింది గదా! అప్పటికీ ఆ బాకీ తీరలేదా? అల్లుడొచ్చిన్నాడు

కూడా అడ్డెడు గింజలు ఇంట్లో లేకుండా నీ ఇంటికి చేరేశానే! అయినా నీ బాకీ తీరలేదా?నా కర్మని, దేవుణ్ణి అనుకొన్నానే కాని నిన్ను తప్పు పట్టానా? ఇయ్యాళ బాకీ మొత్తం కట్టమని నా ఎద్దుల్ని జప్తుచేసి నా కాళ్ళూ, చేతులు నరుకుతావా? పొలం దున్నకుండా నే బతగ్గలనా? ఇయ్యాళ నా ఎద్దుల్ని లాక్కుని రేపు నా పొలం లాక్కుందా మనుకుంటున్నావు కదూ! నా నేల నాది. నా పొలం నా వూపిరి. నే నొదల్ను ! నీ గుండెలు చీలుస్తా! రా! బయటకు రా!

'పంతులుగారో!' బయటనుంచి ఆకాశం ఫెళ ఫెళ మన్నట్టు పెద్దగా కేక. పంతులికి తెలిసిపోయింది. రంగయ్య ఇవ్వాళ తన్ని మింగేస్తాడు. చీల్చి నెత్తురు తాగుతాడు. ఇంకో మార్గం లేదు. రంగయ్యకి లొంగిపోవలసిందే. పంతులు బయటకొచ్చాడు. గుమ్మాని కడ్డంగా నుంచున్న రంగయ్య మాట్లాడలేదు. ఇదేమని అడగలేదు. పెదవి విప్పలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బుసలు కొడ్తుంటే పంతులు కళ్ళలోకి చూశాడు. పంతులు రంగయ్యవైపు చూడకుండా అన్నాడు "రంగయ్యా! నువ్వింత కష్టపడతావంటే నీ ఎద్దుల్ని తోలుకొస్తానా! మీ నాన్న చేసిన బాకీ కదా! పూర్తిచేస్తే చచ్చిన ఆయన ఆత్మ శాంతిస్తుందని..... సరే..... ఇచ్చినంతే చాలు .... ఇవ్వని వాళ్ళని పీడిస్తానా ..... ఇదుగో నోటు. బాకీ చెల్లినట్లే అనుకో ..... నీ ఎద్దుల్ని నువ్వు తోలుకెళ్ళు ....."

రంగయ్య కర్ర వొదిలేసి చతికిల పడ్డాడు. తాచుపాములాంటి రంగయ్య పసిపిల్లవాడై పోయాడు. కరిగి నీళ్ళయిపోయాడు. ఆవు అంత అమాయికమై పోయాడు. కుక్కపిల్లయిపోయాడు. ఈగైపోయాడు. దోమైపోయాడు.

కళ్ళనీళ్ళు ధారలవుతుంటే చేతులు జోడించి అన్నాడు. "అయ్యా! ధర్మ పెబువులు. నా ఎద్దులు నా కిప్పించారు చాలు. ఎప్పటికిమల్లే బాకీ జమేసుకోండయ్యా! మా అయ్య బాకీ తీర్చకుండా ఉంటానా? నేను పోతే నా కొడుకు చేత బాకీ తీర్చేట్టు వొట్టేయించుకొని పోతానయ్యా! కాస్త కనిపెట్టి ఉండండయ్యా! చాలు" అంటూ వంగి వంగి దణ్ణాలు పెడుతూ ఎద్దుల్ని తోలుకు వెళ్ళిపోయాడు. *